కథ



# నిద్ర రాని తల్లి

"నాకు నిద్ర రావాలంటే నువ్వు కథ చెప్పాల్సిందే నాన్నా..." తేల్చేసింది అమ్మాయి.

ప్రతి రాత్రీ పాప నిద్రపోవాలంటే అతను కథ చెప్పాల్సిందే.

ఎన్నని కథలు చెప్పాలమ్మా... అన్ని కథలూ వినేసావే రామాయణమూ, భారతమూ, భట్టీ విక్రమార్క, పంచతంత్రం, కాశీమజిలీ, మర్యాదరామన్న, జాతక కథలూ అన్నీ వినేసావే యిప్పుడిక యింకేమి కథ చెప్పాలమ్మా అంటూ విసుక్కున్నాడు తండ్రి.

"ఎన్ని కథలైనా వుంటాయి, ఒక్కో మనిషిది వొక్కో కథ, ప్రపంచంలో ఎంత మంది మనుషులంటే అన్ని కథలుంటాయన్నావే నువ్వు, ఏదో ఒక మనిషి కథ చెప్పు, నాకు నిద్ర రావడం లేదు" మారాం చేసిందా చిట్టి తల్లి.

"మనిషి కథ కావాల్నా... అలాగంటే మనుషులకు మూలమైన తల్లి కథవొద్దా..."

"అట్లా ఏం కాదు, నాకు తల్లి కథైనా సరే..." "పడుకునే చేతులు రెండూ చెక్కిళ్ళకు ఆనించి కళ్ళు మిలమిల లాడించింది అమ్మాయి.

"అనగనగా ఒక అమ్మ... ఆ అమ్మకు ఒకే ఒక కొడుకు.

"ఒకే కొడుకా?"

"అవును ఒకే ఒక కొడుకు నలుగురు కూతుళ్ళు...కొడుకు పేరు నరసింహారెడ్డి..."

"ఉయ్యాలవాడ నరసింహారెడ్డా? మొన్ననే ఆ కథ చెప్పేసావు గదా..."

"కాదు కాదు యీ నరసింహారెడ్డి బ్రిటిష్ వాళ్ళను ఎదురించిన వుయ్యాలవాడ నరసింహారెడ్డి కాదు... అయితే యితనూ అతని వంశపువాడే..."

"వూహూ..."

"ఒకే ఒక కొడుకని అల్లారు ముద్దుగా పెంచింది ఆ అమ్మ... నలుగురు ఆడపిల్లలు ఒక ఎత్తు అయితే కొడుకొక్కడే ఒక ఎత్తుగా పెంచింది. పెంచుతూంటే... కొరకరాని కొయ్య అయినాడంట..."

"ఏమైంది..."

"నాయనా నీకు మొక్కుతా స్కూల్‌కు పోనాయనా..." అని ఆ తల్లి ఎంత భంగపోయినా, ఆ అబ్బాయి నేను స్కూల్‌కు పోనమ్మా అంటాడు. "కాదు నాయనా స్కూల్‌కు పోతే చదువొస్తుంది, బాగా చదవాల నాయనా నువ్వు చదివి లాయరు గావాల నాయనా, మీ నాయన కాలేదని మీ అత్త ఎంతో బాధ పడుతుంది. నువ్వైనా కావాల నాయినా..." అంటుందా తల్లి.

"నాకు చదువొద్దమ్మా... కాన్వెంట్ బడికి పోనమ్మా... ఏబీసీడీల టీచర్ని చూస్తే భయమైతుందమ్మా" అంటాడా అబ్బాయి.

ప్రతిరోజూ యింతే తల్లి బడికి పంపాలని సర్వ ప్రయత్నాలూ చేస్తుంది. అతన్ని స్కూల్ వద్ద వదిలిపోతుంది, యీయన ఏదో ఒక సాకు చెప్పి బడి నుంచి బయట పడి, మిత్రుల్ని కూడదీసుకొని గడ్డివామి లెంబడో, సేద్యపు బావుల వెంబడో, చేన్లెంబడో సాయంత్రం దాకా తిరిగి సాయంత్రానికి దొంగ దొంగగా యింటికొస్తాడు. అది గమనించి వాళ్లమ్మ తిట్లకు దిగి తరుముతూ వెంట పడుతుంది, లంకంత యిల్లు గదా... యిల్లంతా వాళ్లమ్మకు చిక్కకుండా తిప్పులాడుతాడు, చివరకు అలసి

జి.వెంకటకృష్ణ

పోయి వాళ్ళమ్మకు చిక్కి, నాలుగు గుద్దులు తిని, పడి నిద్రపోతాడు, అది చూసి అమ్మకు ప్రేమ పొంగి, నిద్రలేపి "యింత అన్నం తిను నాయినా" అని భంగపోయి పాలబువ్వ తినిపిస్తుంది. అట్లా రాత్రి గడచిపోతుంది. పొద్దున్నే తెల్లవారుతూనే నిద్రలేపి, మొఖం కడిగి తలకింత చమురు రాసి తలదువ్వి, మంచి బట్టలు తొడిగి, బువ్వ తినిపించి స్కూల్లో వొదులుతుంది "సార్ మావోణ్ణి చూసుకోండి సార్" అని టీచర్‌కు అప్పజెప్పి వొస్తుంది, వాళ్ళమ్మ అలా వెళ్తూనే యీ పిల్లవాని కథ మామూలే...

"అదేం నాన్నా, వాళ్ళ నాన్న యీయన్ను పట్టించుకోడా..."

"ఆ అబ్బాయి నాన్నకు అంత టైం ఎక్కుడుందమ్మా, ఆయన వూళ్ళో వాళ్ళకు ఆ పనులూ, యీ పనులూ చేస్తూ బయట తిరుగుతుంటాడు, యింట్లో అమ్మ వుంది గదా... యీమె యింటి పనులు చేసుకుంటూ సేద్య పనులు, పనివాళ్ళతో చేయించుకుంటూ, కొడుక్కు చదువు రావాలని నిద్రరాని రాత్రిళ్ళు చింతజేసుకుంటూ వుంటుంది. మన పిల్ల నరసింహారెడ్డి మాత్రం చెరువుల్లో బావుల్లో యీదులాడుతూ, చేపలు, ఎండ్రకాయలూ పట్టుకుంటూ నేస్తగాళ్ళ వెంట తిరుగుతూ, వొక్కోసారి నేస్తగాళ్ళ తలలు పగలగొట్టి పారిపోయి గడ్డివాముల్లో దాక్కుంటూ వుంటాడు, అట్లాంటప్పుడు వాళ్ళమ్మ అతన్ని వెదికి పట్టుకొని యింట్లో స్తంభానికి గొలుసుతో కట్టేసి కొడుతుంది. అంతలోనే కొడుకుమీద ప్రేమతో "నీకు చదువు రాకపాయగద నాయినా అల్లరి పట్టి పోతున్నావే" అంటూ పొగిలి పొగిలి

ఏడుస్తూంటూంది.

ఇట్లా నరసింహారెడ్డి పెరిగి పెద్దగవుతూ, ఒకరోజు నేస్తగాళ్ళతో పాటు చెరువులో యీదులాడుతూ వుంటే, గట్టు మీద పోయే వాళ్ళు పక్కవూర్లో వాళ్ళ నాయన్ను చంపేసిండే సుద్ది మాట్లాడుకుంటూండడం విని పరుగున యింటికొచ్చి వాళ్ళమ్మనుచుట్టుకొని ఏడుస్తాడు. ఏమైంది నాయనా, ఎందుకేడుస్తున్నావు, చెప్పు" అని వాళ్ళమ్మ అడిగినా అదేతీరుగా ఏడుస్తాడు, కొడుకేడుస్తుంటే దిక్కుతోచక తల్లికీ ఏడుపొస్తుంది. "ఏమో అయ్యిందమ్మా నా బిడ్డకు" అంటూ తల్లి ఏడుస్తూంటే యింట్లో వున్న ఆడపిల్లలూ ఏడుస్తారు; యింట్లో ఏడ్పులు విని వీధిలో వాళ్ళు వొచ్చి కన్నీళ్ళు పెట్టుకుంటారు, ఏడ్పుల మధ్యా నరసింహారెడ్డి తండ్రి హత్య తెలుస్తుంది. ఆ వార్త విని శోకంలో తడిసిన చెట్టవుతుంది తల్లి, వారం రోజులు కంటికి మంటికీ ఏకధారగా ఏడుస్తుంది. కొడుకును పట్టుకొని ఏడుస్తుంది, కూతుళ్ళను చూసిచూసి ఏడుస్తుంది, ఏడుస్తున్న వదిన మరదళ్ళను పట్టుకొని ఏడుస్తుంది... నిదురరాని ఆ తల్లి రాత్రిళ్ళు యిప్పటికీ ఏడుస్తూనే వుంటుంది.

"ఎందుకు చంపినారు నాన్నా నరసింహారెడ్డి నాన్నని..."

మనుషులకు అసూయలుంటాయమ్మా, ఒక మనిషి పైకి పోతూ వుంటే పచ్చగా బతుకుతూ వుంటే వోర్చుకోలేని వాళ్ళుంటారమ్మా! వాళ్ళు మన మిత్రులుగానే వుంటారు లోపల శత్రుత్వం చేస్తూంటారు. మనల్ని పడగొట్టాలని చూస్తూ వుంటారు. అట్లనే నరసింహారెడ్డి నాన్నక్కూడా చాలామంది శత్రువులైనారు, యీయన పేదోళ్ళందరికీ అవీ యివీ పనులు చేయిస్తా చుట్టుపక్కల వూర్లలో నాయకుడై పోతున్నాడని వొచ్చే మండల ఎలక్షన్లలో పోటీ చేసి గెలిచినా గెలుస్తాడని కుట్రచేసి బాంబులేయించినారు... యితను ఆరడుగుల మనిషి ఆజానుబాహుడు కదా! నిర్భయంగా నడిచిపోతున్నవాడు కాస్తా, బాంబుల మీద పడి తప్పించుకోలేక రోడ్డుమీదనే పడిపోయినాడట.

"ఆ తర్వాత ఏమైంది నాన్నా..."

ఆ తర్వాత ఆ తల్లి నిదురలేనిదైంది, వొంటరిగా యింతమంది కూతుళ్ళను ఎట్లా పెంచుకోవాలా, ఎట్లా పెండ్లిళ్ళు చేయాలా, కొడుకును ఎల్లా కాపాడుకోవాలా అనే చింతలతో రాత్రుళ్ళు ఆమెకు నిదుర కరువైంది. ఆరోజు నుంచీ బతుకుతో ఆమె యుద్ధం చేసింది. యింటా బయటా పనులు ఆమెకు ముందు నుండీ అలవాటే అయినా భర్తలేక పెద్ద దిక్కు లేని యిల్లైన తర్వాత ఆమె మీద భారం పదింతలైంది. అంత కష్టాన్నీ తన పిల్లల కోసం అమె భరించింది. సేద్యం పనులు చేయించుకోవడానికి వూర్లో వాళ్ళ కాళ్ళూ కడుపులు పట్టుకొని, అందరితో మంచిగుంటూ పంటలు వేయించి, కోతలు కోపించి పదిమంది కడుపుల కింత పెట్టి, వూర్లో ఎట్లా బతుకుతుందో చూద్దాం అని మీసం మెలేస్తున్న శత్రువులను గమనించుకుంటూ వొలకబోసిన చోటునే ఎత్తుకోవాలని, వాళ్ళకళ్ళ ముందరే నిలబడి బతికింది. ఒదలాల్సిన చోట వొదిలి దొరికిచ్చుకునే చోట దొరికిచ్చుకుని, తనలాగే మొగుళ్ళను కోల్పోయిన ఎందరిలోనో తన అదృష్టాన్ని చూసుకొని, చదువు రాని కొడుకుకు బతికే తెలివైనా నేర్పిద్దాం అనుకొని కఠినమైన బతుకు బతికిందట ఆ

నరసింహారెడ్డి మీద శత్రువుల కన్ను పడుతోందని తెలుసుకున్న తల్లి మనసు విలవిలలాడుతుంది. తండ్రిలేని బిడ్డని అపురూపంగా పెంచుకున్న బిడ్డ తండ్రి దారిలోనే నడిస్తే తన గతేం కావాలని కుమిలిపోయింది. కొడుకును తన దారిలో పెట్టుకుందామని పెళ్ళి చేస్తే బాధ్యతలు మీదపడి దారికొస్తాడని ఎవరో చెప్తే పెళ్ళి చేయడానికి పెద్ద సంబంధాలే చూసింది.

తల్లి. ఆమె కష్టానికి శ్రమ తోడైనట్లు, శ్రమ చేసిన చేతులకే సిరి అందినట్లు, వాళ్ళ భూమిలో గనులు పడినాయి. గనుల్లో పాలిష్ బండలు పడినాయి. అదృష్టం తలుపు తట్టినట్లు బండలు బయటికి తీసె కంపెనీలు భూములు లీజుకు యివ్వమని అడిగినారు. అనుకూలమైన వాళ్ళకు గనులు లీజుకిచ్చి, తన భూముల్లో గనులకు పోయే దారిలో గేటు తెరిపించిందట ఆ తల్లి.

"గేటు అంటే ఏంటి నాన్నా..."

"టోల్‌గేట్ లాంటిదమ్మా. ఆ దారి వెంబడి మనం వెళ్ళాలంటే ఫీజు కట్టాలన్నమాట... దాంతో ఆమెకు ఎంతో డబ్బు కూడింది, డబ్బులతో పాటు శత్రువులూ పెరిగినారు. శత్రువులతోపాటు నరసింహారెడ్డి పెరిగి పద్దెని



మిదేళ్ళవాడైనాడు, పెద్దవాడైనా కూడా పిల్లలతో కలిసి ఆడుకోవడం మానలేదు, యీదలాడడం, చేపలు పట్టడం మానలేదు".

"ఒకరోజు అతని జట్టులోని ఒక పిల్లవాడు పత్తిచేలో పురుగుల మందు కొడుతూ ఆ వాసన పీల్చి పీల్చి చనిపోతాడు. వాడు చచ్చిపోవడానికి పిల్లలతో పురుగుల మందుకొట్టించడమే కారణం గాబట్టి పిల్లలను పత్తి చేల్లోకి పిలవవద్దని వూరివాళ్ళకు నరసింహారెడ్డి చెప్తే అది చాలామందికి నచ్చలేదు.

మరొక రోజు వూర్లో కోకాకోలా అమ్ముతున్న షాపు నుండీ కూల్ డ్రింకులు తీసుకొని స్నేహితులతో తాగడానికి వాళ్ల చేనుకి వెడతాడు నరసింహారెడ్డి. తాగుతున్నప్పుడు వొలికిన ద్రవం పడి పత్తిపురుగులు చావడం చూసి కోకాకోలాలో విషం వుందని అందుకే పత్తి పురుగుల్ని చంపుతోందని వూర్లో అందరికీ చెప్పాడు. దాంతో కూల్‌డ్రింకు షాపు నడుపుతున్న సర్పంచి తమ్ముడు షాపును మూసేసుకుంటాడు.

మరొకరోజు నరసింహారెడ్డి తన స్నేహితులతో పాటు వూరి బయట దిబ్బలమీద ఆడుకునేప్పుడు దిబ్బల్లో పూడ్చిపెట్టిన బాంబులు పేలి యిద్దరు పిల్లలు చచ్చిపోతారు. ఆ దిబ్బల్లో బాంబులు పూడ్చిపెట్టింది సర్పంచి మనుషులేనని తెలిసినా పోలీసులు ఏమీ చేయరు. మరుసటి రోజు సర్పంచి కట్టిస్తున్న యింటిని ఎవరో ధ్వంసం చేసి పడగొడతారు. యిది ఎవరు చేసారో గానీ చాలా మంచిపనే చేసారని వూర్లో అందరూ అనుకుంటూంటే సర్పంచి కోపంతో వుడుకుడుకి పోతాడు. అల్లరి చిల్లరి నాయాళ్ళ వెంట తిరిగే నరసింహారెడ్డే యిది చేయించి ఉంటాడని సర్పంచి పగబడతాడు.

మరికొన్ని రోజులకు సర్పంచి దొంగగా సారాయి తయారు చేస్తున్న బట్టీలను ఎవరో ధ్వంసం చేసేస్తారు. వూర్లో కూలీ నాలీ చేసుకునే ఆడవాళ్ళూ, సారాయి వూర్లో అమ్మకుంటే ఎంతో బాగుంటుంది అనుకునేవాళ్ళూ ఎంతో సంతోషిస్తారు.

ఆ నోటా యీ నోటా నరసింహారెడ్డి మీద శత్రువుల కన్ను పడుతోందని తెలుసుకున్న తల్లి మనసు విలవిలలాడుతుంది. తండ్రిలేని బిడ్డని అపురూపంగా పెంచుకున్న బిడ్డ తండ్రి దారిలోనే నడిస్తే తన గతేం కావాలని కుమిలిపోయింది. కొడుకును తన దారిలో పెట్టుకుందామని పెళ్ళి చేస్తే బాధ్యతలు మీదపడి దారికొస్తాడని ఎవరో చెప్తే పెళ్ళి చేయడానికి పెద్ద సంబంధాలే చూసింది. అయితే తన మొగుణ్ని చంపినవాళ్ళు, తాను బాగపడడాన్ని వోర్చనివాళ్ళూ, ఎదుగుతున్న తన కొడుకును ఏమన్నా చేస్తారేమోననే భయం ఆ తల్లికి నిద్ర లేకుండా చేస్తోంది గదా! అందుకే తన కొడుకుకు రక్షణగా వుంటూ బలాన్నిచ్చే వాళ్ళతో వియ్యమందాలని యోచన చేసింది. అట్లా తమకు అండగా నిలుస్తారనుకున్న వాళ్ళ పిల్లను కోడలిని చేసుకుంది.

పెళ్ళి అయినా కూడా నరసింహారెడ్డి చిన్ననాటి స్నేహితుల వెంట తిరగడం మానలేదు, యీతలాడ్డం మానలేదు, చేపలు పట్టడం, చేన్ల వెంట తిరగడం, పేదోళ్ళను పట్టించుకోవడం మానలేదు. ఊర్లో చాలామందికి అతనంటే యిష్టం, వాళ్ళు యీసారి ఎలక్షన్‌లో నరసింహారెడ్డిని సర్పంచిగా నిలబెడదామనుకున్నారు.

వాళ్ళకు నరసింహారెడ్డి పచ్చని పైరులాంటివాడు. ప్రవహించే చల్లని నీరులాంటివాడు, వేగంగా దుమికే సెలయేరులాంటివాడు తన కళ్ళముందు చెడు జరిగితే సహించలేనివాడు ఏదైనా చేయాలనుకుంటే చేసేంతవరకూ నిశ్చింతగా వుండలేనివాడు. నరసింహారెడ్డి చేన్లలో గనుల్లో తిరిగే ట్రాక్టర్లను చూసి, ట్రాక్టర్ వెంబడి పడి రెండు రోజుల్లో ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు, మోటార్ సైకిల్ నడపడం నేర్చుకున్నాడు, డ్రైవింగ్ చేస్తున్న కొడుకును చూసి తల్లి ఎంతో మురిసిపోయి, నాకు మోటార్ సైకిల్ కావాలమ్మ అని అడుగుతూనే కొనిచ్చింది. మోటార్ సైకిల్ మీద నరసింహారెడ్డి పంచకళ్యాణి గుర్రమెక్కిన వీరుడిలా తిరిగాడు.అతన్ని వేగంలో ఎవరూ అందుకోలేకపోయారు.



ఒకరోజు రాత్రి మోటారు సైకిల్‌మీద వూరికొస్తున్న నరసింహారెడ్డిని ప్రత్యర్థులు కాపు గాచి, "సర్పంచిగా పోటీ చేసేంత మొగోడివైతివేమి రా, పిల్లనా కొడుకా" అంటూ బాంబులేసి పడగొట్టినారు, కిందపడ్డ వాణ్ణి వేట కొడవళ్ళతో గాయపరచినారు, కొనప్రాణం వున్నంతదాకా నరసింహారెడ్డి నిలబడి పోరాడాలనే చూసినాడు, అతని చేతిలో ఆయుధంలేదు, అతని తోడు ఎవరూ లేరు, చివరకు అమ్మను తలచుకుంటూ నేలకొరిగినాడు.



"అయ్యో ఎంత అన్యాయం నాన్నా... తర్వాత ఆ తల్లి ఏం చేసింది..."

తెగి నేలమీద పడ్డ కొడుకును చూసి, ముక్కలు ముక్కలైన తన స్వప్నాన్ని చూసి, నెత్తురులో గడ్డకట్టిన తన ప్రాణాన్ని చూసి ఆ తల్లి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. తన కొడుకును చంపిన వాళ్ళమీద ప్రతీకారంతో రగిలిపోయింది.వాళ్ళకు శిక్షపడేలా చేయాలని అన్నం నీళ్ళూ వొదలి న్యాయం కోసం పోరాటం చేసింది.

తెగి నేలమీద పడ్డ కొడుకును చూసి, ముక్కలు ముక్కలైన తన స్వప్నాన్ని చూసి, నెత్తురులో గడ్డకట్టిన తన ప్రాణాన్ని చూసి ఆ తల్లి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. తన కొడుకును చంపిన వాళ్ళమీద ప్రతీకారంతో రగిలిపోయింది. వాళ్ళకు శిక్ష పడేలా చేయాలని అన్నం నీళ్ళూ వొదలి న్యాయం కోసం పోరాటం చేసింది.

న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూన్న కాలంలో ఒకరోజు కోర్టు బయట చెట్టుకింద ఒక పండు ముసలామె వెక్కివెక్కి ఏడుస్తూ యీ తల్లికి కనిపించింది "అయ్యో! బిడ్డల్లారా ఎందుకిట్లా అయిపోతున్నారు నాయనా మీ మధ్య మీరే ఒకే నేలతల్లి బిడ్డల మధ్యా ఎందుకిట్లా కక్ష్యలు పెంచుకుంటిరి నాయనా, మాట పట్టింపుల కోసం, పై చేయి అనిపించుకోవడం కోసం, ఆస్తుల కోసం, అధికారం కోసం, ఎందు కిట్లా పనికిరాని ఆవేశాల కోసం బతుకులు తెగనరుక్కుంటున్నారు నాయనా...ఎంతో వైభోగంతో బతి కిన దాన్ని మీ కాలానికి యీ వయసులో నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు గదా నాయనా, ఐకమత్యంతో అభివృద్ధి చెందుతూ పేద సాదల్ని పైకి తీసుకురావాల్సినోళ్ళు యిట్లా నాకు చెడ్డ పేరు తెస్తున్నారుగదా నాయినా" అంటూ విలపిస్తూంటే, చూసి ఎంతో దుఃఖపడి, "ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఎవరు నీ బిడ్డలు అని యీ తల్లి అడిగింది.

"నా బిడ్డలు ఎవరని, ఎంతమందని చెప్పుదునమ్మా! నువ్వూ నా బిడ్డవేకాదా, నీలాంటివాళ్ళు, నువ్వుపోగొట్టుకున్న బిడ్డలాంటివాళ్ళు, నీ బిడ్డను పొట్టన బెట్టుకున్నలాంటివాళ్ళు అందరూ నా బిడ్డలే, ఒకరు మీద ఒకరు పడి చంపుకుంటూ, చంపినందుకు కక్షకట్టి చంపుకుంటూ ప్రతీకారంతో నాశనమైపోతున్నారు. నా ఎదమీద కురుక్షేత్రం జరుగుతూ వుంది, నాగుండెలు రావణ కాష్ఠంలా కాలు తున్నాయి బిడ్డా" అంటూ గోడు వెళ్లబోసుకుంది.

అందుకు యీ తల్లి "ఏం చేస్తాం తల్లీ, కొడుకులూ, మొగుళ్ళూ అంతా మగవాళ్లు. వాళ్ళు మన తల్లుల, కూతుళ్ళ, పెళ్ళాల తలరాతలు నిర్ణయిస్తున్నారు. నీ బాధలాంటిదే నా బాధ కూడా, మన బాధలు తీరే కాలమెపుడొస్తుందో అంటే "అట్లా కాదు బిడ్డా, నువ్వూ తల్లివే నేనూ తల్లినే మనలాంటి తల్లులు బిడ్డల మనసు మార్చే యుద్ధమేదన్నా చేస్తే బాగుండదా,మన మగవాళ్ళు బుద్ధులు మార్చివాళ్ళ అహంకారాల్నీ, ఆవేశాల్నీ, అత్యాశల్నీ కడిగి పారేసి ఆ మనసులో యింత ప్రేమనూ, దయనూ, అణకువనూ నింపి నా గుండె మంటలు చల్లారే శాంతి కల్గించగూడదా... అది మీలాంటి తల్లుల చేతుల్లోనేవుంది ఆలోచించు" అని చెప్పి ఆ పండు ముసలి తల్లి మాయమైంది.

ఈపెద్దావె నాకేమని చెప్పింది అని ఆలోచిస్తూ యీతల్లి శాంతి ఎట్లా కలుగుతుంది, మనిషిని మనిషి ప్రేమిస్తే తప్ప ద్వేషం ఎట్లా పోతుంది, ద్వేషం పోకుంటే శాంతి ఎట్లావొస్తుంది. శాంతికోసం ద్వేషాన్ని వొదలాలని చెప్పిందా ఆతల్లి, అని ఆలోచిస్తూ, తన కొడుకుని చంపినవాళ్ళైనా ఒక తల్లి బిడ్డలే గదా! ఆ కొడుకుల్ని ఒక తల్లిగా ప్రేమిస్తే నా ద్వేషం పోతుంది గదా!, అనుకొని శాంతి కోసం ద్వేషాన్ని విడనాడిందట. అప్పటినుండి ఆ తల్లి యీ సీమలో శాంతి కోసం నిద్ర మరచిపోయిందట. ●

---

## గాంధీజీ హత్య- పూర్వాపరాలు

(19వ పేజీ తరువాయి)

విష్ణుకర్కారే, మదన్‌లాల్‌పహ్వా, గోపాల్‌గాడ్సే (గాడ్సే తమ్ముడు), శంకర కిష్టయ్య, డా.పర్చూరేలకు యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష వేయబడింది. నాథూరామ్ గాడ్సే, నారాయణ ఆప్టేలకు ఉరిశిక్ష విధించబడింది.

అప్పటికి సుప్రీంకోర్టు ఏర్పాటు కాలేదు కనుక పంజాబ్ హైకోర్టుకు అప్పీలు చేసుకోవడానికి నిందితులకు అవకాశమివ్వబడింది.అందరూ జైలు అధికారుల ద్వారా అప్పీలు చేసుకున్నారు. తానే హత్య చేసినట్లు గాడ్సే అంగీకరించాడు; కనుక తన మరణశిక్షపై కాకుండా తనపై మోపబడిన ఇతర నేరాలను గూర్చి అప్పీలు చేసుకొన్నాడు. 22.6.1949న తుది తీర్పు ఇవ్వబడింది. శంకర కిష్టయ్య, డా.పర్చూరేలను నిర్దోషులని ప్రకటించి విడుదల చేశారు. విష్ణు కర్కారే, గోపాల్‌గాడ్సే, మదన్‌లాల్ పహ్వాలకు విధింపబడిన శిక్ష ఖాయం చేయబడింది. గాడ్సే(వయస్సు 37 సం.లు), ఆప్టే (వయస్సు (34 సం.లు)లకు ఉరిశిక్ష ఖాయం చేయబడింది; 15.11.1949న అంబాలా జైలులో వీరిని ఉరితీశారు. యావజ్జీవ జైలు శిక్ష విధింపబడిన ముగ్గురూ 13.10.1964న విడుదలైనారు. వీరిలో శంకర కిష్టయ్య షోలాపూర్‌లో స్థిరపడిన ఆంధ్రుడు. మిగిలినవారందరూ మహారాష్ట్రకు చెందినవారు. "మే ఇట్ ప్లీజ్ యువర్ ఆనర్" అనే పేరుతో గల గాడ్సే వాంగ్మూలం ఆనాడు నిషేధింపబడింది. తాను జైలు నుంచి విడుదలైన తర్వాత గోపాల్ గాడ్సే(గాడ్సే తమ్ముడు) దానిని పుస్తక రూపంలో ప్రచురించాడు. తుపాకీ కొనుగోలు చేసే వరకు గాంధీని హత్య చేయాలని అనుకోలేదని, ఈ హత్యలో మరెవ్వరి ప్రేరణగాని, ప్రమేయం గాని లేదని, ఎవ్వరితోనూ కలిసి కుట్ర చేయలేదని గాడ్సే అంటాడు. "మహాత్మాగాంధీ దలాస్ట్ ఫేజ్" (రచయిత:ప్యారేలాల్), "ఫ్రీడమ్‌ఎట్ మిడ్ నైట్" (రచయితలు: లారీ కాలిన్స్,డామినిక్ లేపియర్) మొదలైన గ్రంథాలలో గాడ్సే చెప్పినవాటికి భిన్నమైన కథనాలూ ఉన్నాయి. "గాంధీజీ జాతి కోసం కష్టపడ్డాడని ఒప్పుకుంటున్నాను. ఆయనకూ ఆయన సేవలకూ నా నమస్కారం.కానీ అంత దేశభక్తునికి కూడా దేశప్రజలను మోసగించి దేశాన్ని విభజించే హక్కులేదు. ఎన్ని దృక్కోణాలతో పరిశీలించినా నైతికంగా నేను చేసిన పని మంచిదేనన్న విశ్వాసం సడలలేదు. భవిష్యత్తులో నిజాయితీ ఉన్న చరిత్రకారులు నా పనిని విలువకట్టి సత్యాన్ని తెలుసుకొంటారనడంలో నాకేమీ సందేహంలేదు"అంటూ ధీమా వ్యక్తం చేశాడు గాడ్సే.

ఏది ఏమైనా భారత రాజకీయ చరిత్రలో, భారతీయుల హృదయాలలో గాంధీజీ మహాత్మాగాంధీయే. గాడ్సే హంతకుడే!

(ఈరోజు గాంధీజీ వర్ధంతి సందర్భంగా) - యామినీ పాణిగ్రాహి